# కారు జోరు.. ప్రచార హోరు

- అభివృద్ధి చేశా.. ఆశీర్వదించండి
- ప్రతిపక్షాలకు గుణపాఠం చెప్పాలి
- గ్రామాల్లో బీఆర్ఎస్‌కు నీరా'జనం'
- అడుగడుగునా ప్రజల అండదండ
- ప్రచారంలో దూసుకపోతున్న ఎమ్మెల్యే వొడితెల సతీశ్ కుమార్



అక్కన్నపేట: పెద్దతండాలో గిరిజనులతో కలిసి నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే సతీశ్ కుమార్



అక్కన్నపేట : ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్

అక్కన్నపేట, అక్టోబర్ 19 : తెలంగాణలో 60 ఏండ్లలో సాధించని అభివృద్ధిని బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదేండ్లలో చేసి ప్రగతి, అభివృద్ధిని వివరిస్తూ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే వొడితెల సతీశ్ కుమార్ దూసుకుపోతున్నారు. గురువారం హుస్నాబాద్ నియోజకవర్గంలోని అక్కన్నపేట మండలంలోని మంచినీళ్లబండ, కేశవాపూర్, గొల్లపల్లి, టేకులతండా, మల్లంపల్లి, మోత్కులపల్లి, పెద్దతండా, పంజాగుట్టతండా చౌటపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని, మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. మౌలిక వసతులు, సాగునీటి ప్రాజెక్టులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలును విజయవంతంగా కొనసాగించామన్నారు. ప్రజల ఆకాంక్ష మేరకు కొత్త పంచాయతీలను ఏర్పాటు చేశామన్నారు. దశాబ్దాల కాలంగా ఎదురుచూస్తున్న గిరిజనుల కలను సీఎం కేసీఆర్ నెరవేర్చారన్నారు. గిరిజన తండాలు, అనుబంధ పల్లెలను పంచాయతీలుగా చేయడంతో స్వయం పాలన సాగుతున్నదన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మాణం పూర్తయిందని, ఎన్నికల తర్వాత సీఎం కేసీఆర్ ప్రారంభిస్తారని తెలిపారు. గౌరవెల్లి ద్వారా 1.06 లక్షల ఎకరాలకు సాగునీరందుతుందన్నారు. అభివృద్ధిని నిరంతరంగా కొనసాగించేందుకు ప్రజలు తిరిగి బీఆర్ఎస్‌కు పట్టం కట్టాలన్నారు.

ఎన్నికలప్పుడు వచ్చే ప్రతిపక్షాలకు ఓటు ద్వారా గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయా గ్రామాల్లో బతుకమ్మలు, మంగళహారతులు, కోలాటాలు, డప్పు చప్పుళ్లు, నృత్యాలు డీజే పాటలు, లంబాడీల వేషధారణ.. జై తెలంగాణ.. జై కేసీఆర్.. కారు గుర్తుకే మా ఓటు అంటూ నినాదాలు చేశారు. ఆయా గ్రామాల్లో బీఆర్ఎస్‌కు ఘననీరాజనం పలుకడంతో ప్రచారం ఉత్సాహంగా ముందుకు సాగింది. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన ప్రజలు అడుగడుగునా అండగా నిలిచారు. మళ్లీ కేసీఆర్ సీఎం.. నువ్వే మా ఎమ్మెల్యే అంటూ ఆశీర్వదించారు. మహిళలు బొట్టు పెట్టి మంగళహారతులతో గ్రామాల్లోకి స్వాగతం పలికారు.

కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు, ఎంపీపీ మాలోత్ లక్ష్మీబీలూనాయక్, జడ్పీటీసీ భూక్యా మంగ, మండల ఇన్‌చార్జిలు మ్యాక నారాయణ, కాసర్ల అశోక్‌బాబు, లింగాల సాయన్న, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎడబోయిన తిరుపతిరెడ్డి, మాజీ జడ్పీటీసీ మాలోత్ బీలూనాయక్, రైతుబంధు మండల అధ్యక్షుడు కందుల రాంరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, ఆయా గ్రామాల పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మంచినీళ్ల బండలో ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు, యువకులు



ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌కు బొట్టుపెడుతున్న ఎంపీపీ మాలోత్ లక్ష్మీబీలూనాయక్



పంజాగుట్టతండాలో ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న గిరిజనులు, ఎంపీపీ, జడ్పీటీసీ



బీఆర్ఎస్ గజ్వేల్ -ప్రజ్ఞాపూర్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

# కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపిద్దాం

- బీఆర్ఎస్ గజ్వేల్ -ప్రజ్ఞాపూర్ పట్టణ కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్ అర్బన్, అక్టోబర్ 19 : కేసీఆర్‌ను మూడోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం గజ్వేల్ శివారుల్లోని శోభగార్డెన్స్‌లో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ చొరవతో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ అద్భుతంగా అభివృద్ధి చెందిందన్నారు. మూడోసారి గజ్వేల్ నుంచి పోటీ చేస్తున్న కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు కృషిచేయాలన్నారు.



హాజరైన నాయకులు, కార్యకర్తలు

బూత్‌స్థాయి వరకు కార్యకర్తల కష్టసుఖాలను పట్టించుకోవాలని, కార్యకర్తల శ్రేయస్సు కోరడంలో బీఆర్ఎస్ ఎల్లవేళలా ముందుంటుందన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి, ఏఎంసీ చైర్మ న్ మాదాసు శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ జకీయొద్దీన్, ఆత్మకమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు నవాజ్‌మీరా, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్, బీజేపీలకు షాక్

## కాంగ్రెస్, బీజేపీల నుంచి 60మంది బీఆర్ఎస్‌లో చేరిక

- అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో భారీగా చేరికలు
- పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని వెల్లడి

కొమురవెల్లి, అక్టోబర్ 19 : కొమురవెల్లిలో కాంగ్రెస్, బీజేపీలకు షాక్ తగిలింది. ఇటీవల కొమురవెల్లి కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బుడిగె గురువయ్యగౌడ్, బ్లాక్ అధ్యక్షుడు నాగమల్ల శ్రీనివాస్ బీఆర్ఎస్‌లో చేశారు. బీజేపీ నాయకుడు గొల్లపల్లి ఆంజనేయులు, కాంగ్రెస్ నాయకుడు గీస లింగం ఆధ్వర్యంలో గురువారం జనగామలో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్, బీజేపీలకు చెందిన 60 మంది కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో పాశం శ్రీను, పాశం రాజు, గొల్లపల్లి మల్లేశం, చిక్కుడు నర్సింహులు, చిక్కుడు ప్రవీణ్, పాశం కనకయ్య(గద్దర్), హరికృష్ణతో పలువురు ఉన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సిలువేరు సిద్ధప్ప, కొమురవెల్లి సర్పంచ్ సార్ల లతాకిష్టయ్య, సర్పంచ్ కొండ శ్రీధర్, మల్లన్న ఆలయ మాజీ డైరెక్టర్ ముత్యం నర్సింహులు గౌడ్, మాజీ సర్పంచ్ గొల్లపల్లి కిష్టయ్య, బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు ఏర్పుల మహేశ్, ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.



పల్లా రాజేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు